సాక్షి
అనకాపల్లి

ఆదివారం । 5 । మార్చి । 2023



సింహాద్రిలో భద్రతకు పెద్దపీట

సింహాద్రి ఎన్టీపీసీలో జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. జీజీఎం సహా ఉద్యోగులంతా సేఫ్టీ వాక్ చేశారు. 8లో



న్యాయవిజ్ఞానం అవసరం

విశాఖ: జాతీయ మహిళా కమిషన్ నిర్వహిస్తున్న వారోత్సవాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపీ ప్రారంభించారు.




నేడు అనంతుని తెప్పోత్సవం

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో ఆదివారం తెప్పోత్సవం జరగనుంది. 50 ఏళ్ల తర్వాత ఉత్సవం నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఈ నెలాఖరుకు జగనన్న లేఅవుట్ ఇళ్లు పూర్తి

కలెక్టర్ ఆదేశం



దోసూరు జగనన్న లేఅవుట్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అచ్యుతాపురం (అనకాపల్లి): మార్చి నెలాఖరు నాటికి జగనన్న లేఅవుట్ ఇళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. శనివారం దోసూరు జగనన్న లేఅవుట్‌ను ఆయన సందర్శించారు. ఇళ్ల నాణ్యతను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ వద్దని సూచించారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులు సరిగ్గా పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాదులో దివ్యాంగురాలు సాలాపు రాముకు పింఛను పంపిణీ

మాడుగుల రూరల్: హైదరాబాద్‌లో ఉన్న 12మందికి వైఎస్సార్ పింఛను కానుకను అందజేసి కె.జె.పురం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ వేచలపు చిన్న, వలంటీర్ రాపేట ప్రసాద్ ప్రశంసలు అందుకున్నారు. కె.జె.పురం గ్రామానికి చెందిన వీరంతా ఉపాధి నిమిత్తం హైదరాబాద్ పరిసరాల్లో నివాసం ఉంటున్నారు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ ఆదేశాల మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్ హైదరాబాద్ పరిసరాల్లోని పోచంపల్లి, గచ్చిబౌలి, కృష్ణానగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నలుగురు దివ్యాంగులు, నలుగురు వితంతువులు, నలుగురు వృద్ధులకు శనివారం మార్చి నెల పింఛను నగదును అందజేశారు.

వడ్డాదిలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై నివేదిక

డీపీవో ఆదేశం



వడ్డాదిలో ఇంటి స్థలాలపై అధికారులను ప్రశ్నిస్తున్న డీపీవో

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో జగనన్న కాలనీ లబ్ధిదార్లకు అందించిన ఇంటి స్థలాలపై విచారణ చేసి నివేదిక అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశించారు. శనివారం ఆమె వడ్డాది, లోపూడి, బంగారుమెట్ట గ్రామాల్లో పర్యటించి పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పరిశీలించారు. ఇటీవల జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కొంతమంది సభ్యులు ఇంటి స్థలాలు అమ్ముకున్నట్లు ఫిర్యాదులు రావడంపై ఆమె స్పందించారు. వడ్డాదిలో ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఎవరెవరున్నారో తనిఖీ చేసి నివేదిక అందించాలని తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో సువర్ణరాజు, హౌసింగ్ ఏఈ గోపీనాథ్‌లను ఆదేశించారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఈవో లోవరాజు తదితర్లు పాల్గొన్నారు.

గ్రేహౌండ్స్‌లో డీజీపీ పర్యటన

కొమ్మాది: రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తిమ్మాపురంలోని గ్రేహౌండ్స్‌ను శనివారం పరిశీలించారు. ఇక్కడ సుమారు 30 నిమిషాలపాటు ఉన్నతాధికారులతో పలు విషయాలపై చర్చించారు.

- బహుళ ప్రాజెక్టులకు కేంద్రంగా వైజాగ్
- రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థల ఎంవోయూలు
- విజయవంతంగా ముగిసిన జీఐఎస్- 2023

పెట్టుబడుల సాధనలో..
విశాఖ.. విజేత



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు



వివిధ పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సర్బానంద సోనోవాల్, రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, పారిశ్రామిక దిగ్గజాలు, అధికారులు

సాక్షి, విశాఖపట్నం: పెట్టుబడిదారులను ఆకర్షించడంలో సాగరనగరి సఫలీకృతమైంది. బహుళ ప్రాజెక్టుల కేంద్రంగా విశాఖకు పట్టం కడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 సాక్షిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికాభివృద్ధికి కొత్తదారులు ఆవిష్కృతం చేశారు. దీంతో ఆర్థిక రాజధానికి ఆశల తోరణం కడుతూ.. పెట్టుబడులు ప్రవాహంలా వెల్లువెత్తాయి. రెండో రోజూ అదే జోరుతో రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులతో ఉమ్మడి విశాఖ సరికొత్త కళను సంతరించుకుంది. మొత్తంగా జీఐఎస్ సదస్సు నవశకానికి నాంది పలికింది.

అంతర్జాతీయ వాణిజ్య రంగాన్ని శాసిస్తున్న దిగ్గజ పారిశ్రామికవేత్తల రాకతో రెండు రోజుల పాటు విశాఖలో పండగ వాతావరణం నెలకొంది. 25 దేశాల నుంచి 46 మందికిపైగా రాయబారులు హాజరవ్వగా.. 45 దేశాలకు చెందిన ప్రతినిధులు రెండు రోజులపాటు సాగర నగరిలో సందడి చేశారు. దక్షిణ భారతదేశంలో గత కొన్నేళ్లుగా వివిధ నగరాల్లో నిర్వహించిన వాణిజ్య సదస్సులకు సైతం



ఫొటో దిగుతున్న ఎంబీఏ విద్యార్థులు

హాజరుకాని దిగ్గజ పారిశ్రామికవేత్తలంతా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానంతో విశాఖలో అడుగు పెట్టారు. రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను.. విభిన్న ప్రాజెక్టులకు సిటీ ఆఫ్ డెస్టినేషన్‌గా విశాఖను నిలబెట్టారు. రెండు రోజుల్లో రూ.13.41లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరగ్గా.. ఇందులో లక్షన్నర కోట్ల రూపాయల ప్రాజెక్టులు విశాఖలో కార్యరూపం దాల్చనున్నాయి. తద్వారా వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

రెండు రోజుల్లో విశాఖకు రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులు

రెండు రోజుల పాటు నిర్వహించిన జీఐఎస్‌లో దిగ్గజ పారిశ్రామిక సంస్థలు రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించాయి. తొలి రోజున రూ.1.25 లక్షల కోట్లు పెట్టుబడులు రాగా.. రెండో రోజున మరో రూ.25 వేల కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు ప్రాథమికంగా గణించారు. ప్రాజెక్టుల విభజన, భూముల కేటాయింపు తదితర ప్రక్రియ పూర్తయిన తర్వాత విశాఖ జిల్లాకు వచ్చిన అసలు పెట్టుబడుల లెక్కలు ప్రకటిస్తామని ప్రభుత్వాధికారులు స్పష్టం చేశారు. మొదటి రోజున ఒబెరాయ్, ఎన్టీపీసీ తదితర సంస్థలు ఎంవోయూలు చేసుకోగా.. రెండో రోజున పల్సస్, తాజ్‌గ్రూప్, హెచ్‌పీసీఎల్ మొదలైన సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. క్షేత్రస్థాయిలో ఈ ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయితే లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.



సదస్సుకు హాజరైన ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు

నాలుగు ప్రాజెక్టులు ప్రారంభం

సదస్సు ప్రాంగణం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 14 ప్రాజెక్టుల కార్యకలాపాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో నాలుగు సంస్థలు ఉమ్మడి విశాఖలో ఉండటం విశేషం. అచ్యుతాపురం సెజ్‌లో రూ.460 కోట్ల పెట్టుబడితో లారస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. దీని ద్వారా 1,200 మందికి ఉపాధి లభించింది. అచ్యుతాపురం సెజ్‌లోనే బల్క్ డ్రగ్‌కు సంబంధించి అమరాలైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యకలాపాలను సీఎం జగన్ ప్రారంభించారు. రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ సంస్థ ద్వారా 190 మందికి ఉపాధి కల్పించారు. సెరామిక్, పాలిమరిక్ తదితర హైవోల్టేజ్ ఇన్సులేటర్స్ తయారు చేసే ప్రాజెక్టును రూ.174 కోట్లతో విన్‌విన్ స్పెషాలిటీ ఇన్సులేటర్స్ లిమిటెడ్ నిర్మించింది. దీని ద్వారా 500 మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. అలాగే అనకాపల్లిలో రూ.200కోట్లతో ఏవోవీ అగ్రో ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించిన మీట్ ప్రాసెసింగ్ సంస్థను సీఎం ప్రారంభించారు. ఈ కంపెనీ ద్వారా 1000 మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. మొత్తంగా రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విశాఖపట్నం ప్రధాన పాత్ర పోషించిందంటూ దిగ్గజ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రశంసల జల్లు కురిపించాయి.

జీ-20లో మళ్లీ కలుద్దాం

ఆత్మీయ అతిథులకు నమస్సుమాంజలి..
నన్ను ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేసిన 45 దేశాలు.. 100 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలు.. 14 వేల మంది ప్రతినిధులందరికీ వందనాలు. డైనమిక్ లీడర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో పరిపాలన రాజధానిగా అడుగులు వేస్తున్న నా ఒడికి చేరుకున్న మీ అందరికీ ఆత్మీయ ఆతిథ్యం అందించాను. ఆంధ్రా వంటకాల రుచులు చూపించాను. నా ప్రజల ప్రేమను పరిచయం చేశాను. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన మీ అందరికీ మరిచిపోలేని జ్ఞాపకాలను మూటగట్టి మీ వెంట పంపిస్తున్నాను. కోవిడ్ తర్వాత కొత్త ఊపిరి పోసుకుంటున్న మా రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ.. ఆర్థిక భరోసా అందించినందుకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో ఎప్పుడూ చూడని దిగ్గజ పారిశ్రామికవేత్తలు తరలిరావడం అపురూప కానుకగా భావిస్తున్నా. టూరిజం ప్రాజెక్టులు, రెస్టారెంట్లు, హోటళ్లు, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్, పునరుత్పాదక ఇంధన వనరులు.. ఇలా విభిన్న రంగాల్లో భిన్నమైన ప్రాజెక్టులను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల యాజమాన్యాలకు ఇక్కడ ప్రజలంతా రుణపడి ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహించిన జీఐఎస్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇదే స్ఫూర్తితో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించే జీ-20 సదస్సుకు మీరంతా వస్తున్నట్లు తెలిసింది. జీ-20కి వచ్చే అతిథులందరినీ మరింత ప్రేమతో అక్కున చేర్చుకునేందుకు ఇప్పటి నుంచే ముస్తాబవుతా. మీ అందరి కోసం 28వ తేదీన నా ప్రజలందరితో కలిసి ఎదురుచూస్తుంటా.!

బై..బై..
మీ.. విశాఖ నగరం

– కరుకోల గోపీ కిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం



సమ్మిట్ ప్రాంగణంలో విదేశీ ప్రతినిధుల సెల్ఫీ ముచ్చట..

కమనీయం.. రమణీయం..

8లో





కల్యాణోత్సవంలో అమ్మవారి మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చక స్వామి..శనివారం రాత్రి స్వామి వారికి హంస వాహనంపై తిరువీధి సేవ

కల్యాణ శోభతో కళకళలాడుతూ.. కోనేటిరాయుడు శ్రీదేవి భూదేవి అమ్మవార్లను చేపట్టారు. వారి వివాహ వేడుక ఉపమాకలో కమనీయంగా.. రమణీయంగా జరిగింది. వెంకన్న వార్షిక కల్యాణం శనివారం వేకువజాము వరకు కనువిందుగా సాగింది. వేలాదిమంది భక్తులు తెల్లవార్లూ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. శనివారం రాత్రి స్వామి వారికి హంస వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు.

గోవాడ క్రషింగ్‌కు అంతరాయం

- ఆఫర్‌సాఫ్ట్ రాడ్డు విరిగిపోవడంతో నిలిచిన కార్యకలాపాలు
- యార్డులో నిరీక్షిస్తున్న చెరకు బళ్లు



ఫ్యాక్టరీ యార్డులో నిలిచిపోయిన చెరకు బళ్లు

చోడవరం: గోవాడ సుగర్స్‌లో క్రషింగ్‌కు శనివారం అంతరాయం ఏర్పడింది. క్రషింగ్ జోరందుకున్న సమయంలో ఆకస్మికంగా మిల్లు హౌస్‌లో ఆఫర్ సాఫ్ట్ రాడ్డు విరిగిపోయింది. దీంతో క్రషింగ్ నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి ఆఫర్‌సాఫ్ట్ రాడ్డు విరిగిపోగా ఉదయం వరకు నిమ్మదిగా చెరకు గానుగాడారు. ఆ తర్వాత యంత్రాలు అనుకూలించకపోవడంతో విరిగిపోయిన రాడ్డు స్థానంలో కొత్తది వేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. మరమ్మతు చేయడంలో కొంత జాప్యం ఏర్పడటంతో క్రషింగ్ నెమ్మదించింది. ఇప్పటికే ఇదే రాడ్డు రెండుసార్లు విరిగిపోయింది. నాణ్యత లోపం వల్లే ఇలా జరుగుతోందని, దీనిపై దృష్టి సారించి నాణ్యమైన పరికరాలు వేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మికులు, రైతులు కోరుతున్నారు. క్రషింగ్‌కు అంతరాయంతో యార్డులో చెరకు బళ్లు పెద్దసంఖ్యలో నిలిచిపోయాయి. చెరకు సరఫరా చాలినంత లేక ఆశించిన మేర క్రషింగ్ జరగలేదని అంతా ఆందోళన చెందుతున్న తరుణంలో.. వారం రోజుల క్రితం పరిస్థితి చక్కబడింది. ఈ తరుణంలో ఫ్యాక్టరీలో మిషనరీ సమస్య తలెత్తడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. యాజమాన్యం దీనిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో 34 కేంద్రాల్లో ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. కలెక్టరేట్‌లో శనివారం పరీక్షల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పరీక్షలకు 13,281 (10,732 రెగ్యులర్, 2,549 ఒకేషనల్)మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 16,236 (13,974 రెగ్యులర్, 2,262 ఒకేషనల్) మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేస్తాయని, 5 సిట్టింగ్ స్క్వాడ్‌లు కూడా ఉంటాయని చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ టీవీలు అమర్చాలని, మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని, పోలీస్ బందోబస్తు పటిష్టం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని చెప్పారు. ఆర్టీసీ ప్రతి గ్రామం నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఉమారాణి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుజాత, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ బి.రాధ, డిప్యూటీ డీఈవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



నక్కపల్లి: మండలంలో పెదతీనార్లకు చెందిన మేరుగు నూకమ్మ(52) శనివారం ఉదయం ఉపాధి కూలీ పనులకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందింది. రోజు మాదిరిగానే గ్రామానికి సమీపంలో కొండపైకి కందకాలు తవ్వే నిమిత్తం ఉపాధి పనులకు వెళ్లింది. ఈ క్రమంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలింది. తోటి కూలీలు సపర్యలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అప్పటికే ఆమె మరణించింది. ఈమె మృతదేహాన్ని ఎంపీటీసీ మేరుగు నాగేశ్వరరావు సహకారంతో తోటి కూలీలు, బంధువులు దుప్పట్లో డోలీగా కట్టి ఇంటికి తీసుకొచ్చారు. నూకమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సింహాద్రిలో భద్రతకు పెద్దపీట

ఎన్టీపీసీ జీజీఎం సిన్హా



జెండాను ఆవిష్కరిస్తున్న జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో 52వ జాతీయ భద్రతా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నివాసితులు, ఉద్యోగులతో కలిసి సేఫ్టీ వాక్ నిర్వహించారు. వారితో భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ప్లాంటులో సంస్థ జీజీఎం సిన్హా సేఫ్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత ప్రమాణాలు పాటించాలని ఉద్యోగులకు, కార్మికులకు సూచించారు. భద్రతా సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. ప్రమాదాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కమనీయంగా వెంకన్న కల్యాణం

- వేడుక తిలకించి పులకించిన భక్తజనం
- ఆగమశాస్త్రానుసారం కల్యాణతంతు



నక్కపల్లి: కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నక్కపల్లి: కల్యాణం తిలకిస్తున్న భక్తజనం



బుచ్చెయ్యపేట: ఆలయంలో కచేరి చేస్తున్న కళాకారులు



బుచ్చెయ్యపేట: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: కల్యాణ కాంతులతో ఉపమాక కనువిందు చేసింది. కమనీయ శోభతో కళకళలాడింది. కోనేటి రాయుని వార్షిక తిరుకల్యాణం శనివారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా జరిగింది. దేవదేవుని తిరుకల్యాణం తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించిన స్వామివారి కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు తెల్లవార్లూ మేల్కొన్నారు. ఏటా పాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు జరిగే ఈ కల్యాణోత్సవంలో కన్యావరుణ సంవాదాన్ని ప్రధానంగా పేర్కొంటారు. శుక్రవారం అర్ధరాత్రి ఉపమాకకు చెందిన సింహాద్రాచార్యుల ఇంటి వద్ద స్వర్ణాలంకరణ భూషితుడైన వేంకటేశ్వర స్వామిని ఇత్తడి గరుడ వాహనంపైన, పట్టువస్త్రాలు బంగారు ఆభరణాలతో ముస్తాబైన శ్రీదేవి, భూదేవిని శేషవాహనంపైన ఎదురెదురుగా ఉంచి, పెళ్లి మాటల తంతును నిర్వహించారు. అనంతరం ఉభయనాంచారులతో కూడిన స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత రాజగోపురం పక్కన కల్యాణ వేదిక వద్ద కల్యాణ తంతు ప్రారంభమైంది. తిరుపతి నుంచి ప్రత్యేకంగా వచ్చిన అర్చక స్వాములు నాలుగు వేదాలను పఠించారు. స్వామివారికి టీటీడీ తరఫున అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం తిలకించే భక్తుల కోసం పెద్ద షెడ్లు వేసి, షామియానాలు, కార్పెట్లు ఏర్పాటు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో నక్కపల్లి సీఐ నారాయణరావు, ఎస్‌ఐ శిరీషల ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు.

వడ్డాది వెంకన్నకు ప్రత్యేక పూజలు

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ఇష్టదైవమైన రోజు కావడంతో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి క్యూ లైన్లలో బారులు తీరారు. మెట్ల మార్గం, గుడి వెనుక, ముందు భాగంలో రోడ్లు గుండా వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను దేవస్థానం అధికారులు వేడుకగా నిర్వహించారు. ఆలయ మండపంలో హోమాలు, సదస్యం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీపీవో శిరీషారాణి, తహసీల్దార్ అంబేడ్కర్, వడ్డాది ఈవో లోవరాజు తదితరులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కొండపై పలువురు కళాకారులు భక్తి పాటలు, సంకీర్తనలతో అలరించారు.

పరారైన గంజాయి నిందితులు అరెస్టు



గంజాయి కేసులో అరెస్టయిన మరో ఇద్దరు నిందితులు

కోటవురట్ల: కన్నూరుపాలెంలో ఆటోలో గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను శనివారం పట్టుకొని అరెస్టు చేసినట్టు సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. ఈ నెల 1న గొలుగొండ మండలం ఏటి గైరమ్మపేట నుంచి తాళ్లపాలెం వైపు ఆటోలో 50 కిలోల గంజాయిని తరలిస్తూ కన్నూరుపాలెంలో రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని ఢీకొని దాని డ్రైవర్ కాపారపు నాగరాజు (32) పట్టుబడి అరెస్టు అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆటో, 50 కిలోల గంజాయి కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారైన నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన మాకిరెడ్డి రాజశేఖర్(31), రోలుగుంట మండలం కొత్తపట్నానికి చెందిన ఆటో యజమాని జన శ్రీను (45)లను కూడా శనివారం తాళ్లపాలెం కూడలి వద్ద పట్టుకొని అరెస్టు చేశామన్నారు. స్కూటీపై పరారవుతుండగా పట్టుకున్నామని, స్కూటీని సీజ్ చేసి నిందితులను కోర్టుకు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి



ఏదురి గోవింద

యలమంచిలి : ఉపమాక వెంకన్న కల్యాణానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళుతున్న యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. మృతుడు ఏదురి గోవింద్(22) మునగపాక మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వలంటీర్‌గా పోలీసులు గుర్తించారు. నక్కపల్లి మండలం ఉపమాక దైవ దర్శనానికి వెళ్లిన గోవింద్ శనివారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెంకటాపురం వెళుతుండగా యలమంచిలి మండలం రేగుపాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన గోవింద్‌ను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి గోవింద్ మృతి చెందినట్టు రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వెంకటాపురంలో విషాదం

మునగపాక: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ఏదురి గోవింద(22)మృతితో గ్రామంలో విషాదం అలముకుంది. గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు ఏదురి రమణ, రమణమ్మ దంపతుల కుమారుడు గోవింద్ గ్రామ వలంటీర్‌గా సేవలందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో గోవింద్ చురుకైన సేవలందించేవారు. గ్రామంలో అందరితో సఖ్యతగా ఉండేవారు. సర్పంచ్ సుందరపు నీలకంఠ స్వామి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఉప సర్పంచ్ సాయివజ్రం తదితరులు గోవింద్ మృతికి సంతాపం తెలిపారు,

పట్టభద్రుల ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించండి

చోడవరం పట్టణంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రచారం



బ్యాలెట్ నమూనా పత్రాలు విడుదల చేస్తున్న ధర్మశ్రీ, కోలా గురువులు

చోడవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. చోడవరం పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ కాలేజీల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులతో వేర్వేరుగా శనివారం సమావేశాలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా గురువులతో కలిసి ధర్మశ్రీ చోడవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. అన్నవరంలో పట్టభద్రులతో సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి, విద్యావేత్తల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ విశాఖను పరిపాలనా రాజధానిగా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనువాసరావు, యూత్ మండలాధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బొగ్గ చందు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాలో మహిళలకు శిక్షణ



యోగ శిక్షణలో స్వయం సహాయక సంఘాల మహిళలు

కశింకోట: కశింకోటలోని కస్పావీధి, గవరపేట ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి స్వయం సహాయక సంఘాల మహిళలకు యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగాసనాలు వేయడం, ప్రాణాయామం, ధ్యానం చేయడంలో మెలకువలు వివరించి అభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, ఏపీఎవో శివ, మిషన్ ప్రతినిధులు వి.లక్ష్మయ్య, ప్రహ్లాద్, ఐఎస్ రాజు, మురళీ మోహన్, రమ సత్యవతి, ఎ.మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో ఆదివారం వాకర్స్‌క్లబ్, ఉషాప్రైమ్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ ప్రతినిధి జి.రవికుమార్ తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ వ్యాధులతో పాటు జనరల్ తనిఖీలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం జరిగే క్లబ్ జనరల్ బాడీ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

మాధవ్‌కు మద్దతుగా ప్రచారం

కశింకోట: బీజేపీ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా మళ్లీ పోటీ చేస్తున్న పీవీఎన్ మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. కశింకోటలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి మాధవ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు జనపరెడ్డి హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం

అనకాపల్లిటౌన్: పట్టణంలో గవరపాలెం వీవీ రమణ రైతుభారతి హాల్లో ఆదివారం జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు శనివారం పేర్కొన్నారు. వయోవృద్ధుల సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. వృద్ధులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
సాచి	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్ స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,996 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,000
మొదటి రకం	3,430	3,690
రెండో రకం	3,160	3,510
మూడో రకం	3,020	3,140

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-8 యూనిట్లు, 'బి'పాజిటివ్-21 యూనిట్లు, 'ఒ'పాజిటివ్ 12 యూనిట్లు, 'ఎబి'పాజిటివ్ -3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 247 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 496 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ను సంప్రదించవచ్చు.

ఘనంగా ప్రారంభమైన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



కశింకోటలోని వెలంపేట గౌరమ్మ ఊరేగింపు



అమ్మవారికి పూజలు చేస్తున్న మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ జయరజని



అమ్మవారి సన్నిధిలో గవర కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

కశింకోట: వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఊరేగించారు. గౌరమ్మను ప్రజలు దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవం సందర్భంగా ప్రధాన పంచాయతీ రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లు ఆహూతులను అలరించాయి. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ జయరజని, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మాజీ మంత్రి గంటా, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. పిళ్లావారి కుటుంబ సభ్యులచే అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబు నేత్రపర్వంగా వేడుక జరిపారు. శనివారం ఆలయ మండపంలో వివాహ ప్రవేశ హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఈవో ఆదినారాయణ, సిబ్బంది ప్రసాద్‌బాబు, రాజేష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ విజేత ప్రింట్ మీడియా



పోటీల్లో పాల్గొన్న మీడియా సభ్యులు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ స్టేడియంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల మధ్య శనివారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో ప్రింట్ మీడియా విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రింట్ మీడియా ఆఖరి ఓవర్‌లో విజయం దక్కించుకుంది. ఈ కార్యక్రమంలో మీడియా సభ్యులు కె.సాయిరాం, మహేష్, సత్యనారాయణ, గంగాధర్, బోసు, స్వామి, అజయ్, ప్రసాద్, రామచంద్రరావు, రాజేష్, రామారావు, సతీష్, ధర్మారెడ్డి, కొండలరావు, శేఖర్, శ్రీను, గంటా శ్రీను, నాయుడు, శివాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



గాంధీనగరం హైస్కూల్లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



తుమ్మపాలలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లిటౌన్: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం ఖాయమని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. పట్టణంలో గాంధీనగరం, ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాల, పెద హైస్కూళ్లలో ఆయన స్థానిక నేతలతో కలిసి శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఎన్నో విప్లవాత్మక మార్పులతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పట్టభద్రులంతా సుధాకర్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులు వినకోట రాజాసతీష్, కొండూరు రవీంద్రనాథ్, మూనూరు శ్రీనివాసరావు, ఆకుల సంతోష్, కుండల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో..

అనకాపల్లి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గడువు దగ్గర పడుతుండడంతో వైఎస్సార్‌సీపీ నేతలు సీతంరాజు సుధాకర్ గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసారు. మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ నాయకత్వంలో ఇంటింటికీ తిరుగుతూ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్లను నేతలు కోరారు. సీఎం జగన్ పాలనకు పట్టభద్రులంతా బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ వద్దాది భారతి, వద్దాది అశోక్, కళ్యాణబాబు, పడాల గణపతి, లహరి, లక్ష్మణ, శివాజీ, ఆర్టీసీ సత్యనారాయణ, పీలా బుజ్జి పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యకు పరిష్కారం ఎప్పుడో?



నర్సింగరావుపేట రహదారిలో పారుతున్న మురుగు నీరు

అనకాపల్లిటౌన్: మురుగు నీటి సమస్య పరిష్కరించే నాథుడే కరవయ్యాడంటూ స్థానిక నర్సింగరావుపేట వాసులు వాపోతున్నారు. ఎన్నిసార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదంటున్నారు. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో డ్రైనేజీలు నిండిపోయి రహదారిపైకి మురుగు నీరు చేరుకోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పేట వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని కాలువల గుండా మురుగు నీరు సక్రమంగా పారేలా చూడాలని కోరుతున్నారు.

అమ్మో రంధ్రం..

- ప్రజలను భయపెడుతున్న బాబా ఆలయం రోడ్డులోని గొయ్యి
- పైకప్పు అమర్చాలంటూ స్థానికుల వినతి



నర్సింగరావుపేట షిర్డీసాయి బాబా ఆలయం ముందు రహదారి మధ్యలో ఏర్పడిన రంధ్రం

అనకాపల్లిటౌన్: స్థానిక నర్సింగరావుపేట షిర్డీ సాయిబాబా ఆలయం ఎదుట పెద్ద రంధ్రం పాదచారులను, వాహన చోదకులను భయకంపితులను చేస్తోంది. దీనిని చూసిన వారంతా 'అమ్మో గొయ్యి.. పరధ్యానంగా నడిస్తే అంతే సంగతులు' అంటున్నారు. ఇదే రహదారిలో వందల ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రహదారిలో ఈ ఈ గోయికి పైకప్పు అమర్చాలంటూ సంబంధిత అధికారులను ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

వేతనదారులందరికీ పనులు కల్పించండి



తామరబ్బలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి

దేవరాపల్లి: జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి సంబంధిత సిబ్బందికి సూచించారు. తామరబ్బ పంచాయతీలో ఉపాధి హామీ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేస్తే తగిన గిట్టుబాటు కూలి లభిస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలోనే పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈమె వెంట ఉపాధి ఏపీవో డి. చంద్రకళ, పంచాయతీ సెక్రటరీ ఎల్. లింగన్న, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఎనిమిది లక్షల పనిదినాలు కల్పించాలి

నాతవరం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఎన్ఆర్ఈజీఎస్ అదనపు ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.25 కోట్లతో బడ్జెట్ రూపొందించామన్నారు. మండలంలో 13 వేలకుపైగా జాబ్‌కార్డుదారులకు ఈ ఏడాది 8 లక్షల పని దినాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న 5 వేల మంది కూలీలను 7 వేలకు పెంచాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీవో లోకుల యాదిగిరీశ్వరరావు, ఏపీవో చిన్నారావు, హౌసింగ్, పీఆర్ జేఈలు జోగారావు, వెంకటేశ్వ రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పక్కాగా వెబ్ కాస్టింగ్



కెమెరా ఎలా అమర్చాలో వివరిస్తున్న శివ

తుమ్మపాల: రానున్న శాసన మండలి ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్ పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ సాంకేతిక సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వెబ్‌కాస్టింగ్ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సరైన ప్రదేశంలో కెమెరా అమర్చాలని, పోలింగ్ ప్రక్రియ స్పష్టంగా రికార్డు అయ్యే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ముందు రోజే పరికరాలను పరీక్షించుకోవాలన్నారు. అనంతరం బృహస్పతి ఏజెన్సీకి చెందిన సాంకేతిక నిపుణులు శివ వెబ్ కాస్టింగ్‌కు కెమెరా ఏ విధంగా అమర్చాలి, కంప్యూటర్‌ను ఏ విధంగా ఆపరేట్ చేయాలనే అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రమణమూర్తి, వివిధ కళాశాలలకు చెందిన బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



తుమ్మపాలలో పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. గ్రామంలో శనివారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. దోమల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పంచాయతీ చేపడుతున్న పారిశుధ్య పనులకు ప్రజలంతా సహకరించాలని కోరారు. చెత్త, ఇతర వ్యర్థాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా వేయవద్దని ప్రజలను కోరారు. పంచాయతీ ఈవో కె. శ్రీనివాస్, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, పంచాయతీ వార్డు సభ్యుడు కొయ్య జగదీష్, మూడో సచివాలయం కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి అంబేడ్కర్

మాకవరపాలెం: దేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. స్థానిక దళితవాడలో స్థానికులు మార్తి శేఖర్, సాంబ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్‌ఐ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అల్లంపల్లి శిరీష మాట్లాడుతూ యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ మేనేజర్ అల్లంపల్లి వెంకటరమణ, అంబేడ్కర్ యువసేన అధ్యక్షుడు లచ్చారావు, వార్డు సభ్యులు సూర్యలక్ష్మి, రమేష్, సింహాచలం, మరిడియ్య, శివ పాల్గొన్నారు.

ఉగాది నాటికి వైఎస్సార్ జగనన్న ఇళ్లు పూర్తి కావాలి



అచ్చెర్లలో హౌసింగ్ లే-అవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి మోహనరావు

కశింకోట: ఉగాది నాటికి వైఎస్సార్ జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి బి. మోహనరావు లబ్ధిదారులను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న లే-అవుట్లు, ప్రాధాన్యతా భవనాల నిర్మాణాన్ని శనివారం హౌసింగ్ డేలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలను సందర్శించి ఉగాది నాటికల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. అలాగే అచ్చెర్లలో సచివాలయ భవనం, ఇతర ప్రాధాన్యతా భవనాలను పరిశీలించి వాటిని సత్వరమే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ అధికారులతో సమావేశమై వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రక్త హీనతతో బాధపడుతున్న 10–19 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని వారు ఒక్కరే సేవించాలని, కుటుంబం అంతా పంచుకుంటే ప్రయోజనం తక్కువగా ఉంటుందన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనానికి నూతన సోయగాలు



మహాత్మాగాంధీ ఉద్యానవనం

అనకాపల్లిటౌన్: లయన్స్ క్లబ్ పక్కన గల మహాత్మా గాంధీ ఉద్యానవనం కొత్త సోయగాలతో అలరారుతోంది. రూ.కోటి నిధులు వెచ్చించి జీవీఎంసీ ఈ పార్కును అందంగా తీర్చిదిద్దింది. మహాత్మాగాంధీ విగ్రహం, పలు రకాల పూలమొక్కలతో ఈ పార్కు ఇప్పుడు నందనవనంగా మారిపోయింది. గత ప్రభుత్వాల హయాంలో మోడివారిన చెట్లు, తుప్పు పట్టిన గేట్లతో పాటుబడి దీనస్థితిలో కనిపించేది. దీంతో ఈ పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండేవి. అలాగే ఇక్కడ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, జూదం వంటివి నిత్యకృత్యంగా ఉండేవి. ఈ దశలో స్థానిక నాయకులు పార్కును అభివృద్ధి చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విన్నవించారు. ఆయన స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో జీవీఎంసీ పార్కును అందంగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం చిన్నారులతో పాటు వృద్ధులు ఈ పార్కులో సందడి చేస్తూ కనిపించే దృశ్యాలు ఆహ్లాదం కలిగిస్తున్నాయి.

అపరాలతో అధిక లాభాలు



మాట్లాడుతున్న పీవీకె జగన్నాథరావు

అనకాపల్లిటౌన్: జిల్లాలో ప్రధాన రబీ పంటలైన నువ్వులు, అపరాలు, వేరుసెనగ, జనుము, మొక్కజొన్న, వరి, చెరకు వంటి వాటిలో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్) ఏడీఆర్ పీవీకె జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం జరిగిన టీఎన్వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీలో పెరుగుతున్న అపరాలు, నువ్వులు, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ ఈ ఏడాది చిరుధాన్యాల సాగును ప్రోత్సహించనున్నామన్నారు. వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించి, ఖర్చు తగ్గించుకోవడానికి గ్రామస్థాయిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన ఉద్యాన పంటలైన మామిడి, జీడి, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. వివిధ సబ్ డివిజన్లకు సంబంధించిన వ్యవసాయ సహాయ సంచాలకులు, ఉద్యాన అధికారులు తమ ప్రాంతంలో వ్యవసాయ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ బి.భవానీ, పరిశోధనాస్థానం చెరకు ప్రధాన శాస్త్రవేత్త చిత్కళాదేవి, శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, ఎం.విశాలాక్షి, డి.ఆదిలక్ష్మి, ఆర్.సరిత, చంద్రశేఖర్, సీతారామలక్ష్మి, డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఆధార్ కేంద్రాలు తెరిచే ఉంటాయి

అనకాపల్లిటౌన్: ఆదివారం అయినప్పటికీ నేడు ఆధార్ సేవా కేంద్రాలు తెరిచే ఉంటాయని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.వెంకటరావు శనివారం పేర్కొన్నారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.